
సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
మంగళవారం, జూలై 30, 2024
డిజిటల్






# నేడు రెండో విడుత రుణమాఫీ

- మాఫీ కానున్న రూ.1.50 లక్షలు
- రైతులు, ప్రజా ప్రతినిధులు తరలిరావాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

తెలంగాణ ప్రభ ( సిరిసిల్ల) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ రెండవ విడుత నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30వ తేదీన (మంగళవారం) ఉదయం 11 గంటలకు విడుదల చేయనుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధుల, రైతుల, అధికారుల సమక్షంలో రెండో విడుత రుణమాఫీ రూ. 1.50 లక్షల కార్యక్రమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ రుణమాఫీ కార్యక్రమంలో జిల్లాలోని రైతులు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు వ్యవసాయ శాఖ సిబ్బంది, సహకార శాఖ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రుణమాఫీ లబ్ధిదారులైన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
WANTED
సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్ : 99854 44342

# సెల్ ఫోన్ పోయిందా?

- సీఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయండి
- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఫోన్ల రికవరీలో రాష్ట్రంలో మొదటి స్థానం




**తెలంగాణ ప్రభ ( సిరిసిల్ల) :** సెల్ ఫోన్ పోతే పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సిందిగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుండి పడిపోయిన, దొంగిలించబడిన 78 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు. సెల్ఫోన్ పోయిన పక్షంలో టెన్షన్ పడకుండా వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లోలాగిన్ అయి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఈ రోజు వరకు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా 1200 ఫోన్ లను గుర్తించడం జరిగిందని1019 ఫోన్లను సంబంధిత బాధితులకు అందించినట్లు తెలిపారు. విటీ విలువ సుమారు కోటి రూపాయల పైగా ఉంటుందని అన్నారు. రికవరీలో 84 శాతం లో జిల్లా మొదటి స్థానంలో ఉందని అన్నారు. ఫోన్ దొరికిన బాధితులలో, గ్రామాలలో స్నేహితులతో ఎవరైనా ఫోన్ దొంగతనం జరిగితే తక్షణమే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా దొంగతనానికి గురైన ఫోన్లను పట్టుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుందని ముందుగా పోలీస్ స్టేషన్లో తర్వాత మీ సేవ కేంద్రంలో www.ceir.gov.in వెబ్సైట్లో లాగిన్ అయి వివరాలు నమోదు చేయాలని తెలిపారు.



## పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి**

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కార్యాలయంలో 19వ డివిజన్ బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ నందిగామ మహేష్ ముదిరాజ్ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షతులై మహేష్ మిత్ర బృందం సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రజల పక్షాన ప్రజలకు న్యాయం చేసే విధంగా తమ పాలన ఉంటుందన్నారు కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారికి అన్ని విధాలుగా న్యాయం చేయడమే మా లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, రాము, కళ్యాణ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



## నేడు కలెక్టరేట్ ముట్టడి

- ఎమ్మెల్యే స్పందించకపోవడంపై ఆగ్రహం
- ఎనిమిదవ రోజుకు చేరిన దీక్షలు
- ఏఐటీయూసీ మద్దతు

**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) :** వస్త్ర పరిశ్రమ సమస్యల పట్ల స్థానిక శాసనసభ్యులు స్పందించకపోవడంపై జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి కల్పించాలని విద్యుత్ సబ్సిడీ అందించాలని కోరుతూ వస్త్ర పరిశ్రమ జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు సోమవారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ సమస్యల పట్ల స్థానిక శాసనసభ్యులకు పట్టింపు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనిమిది రోజులుగా దీక్షలు జరుగుతున్న కనీసం ఒక్కసారి కూడా స్పందించకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వానికి సమస్యలను ఎన్నిసార్లు మొరపెట్టిన పట్టించుకోవడంలేదని అన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నేడు చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. దీక్షలకు ఏఐటీయూసీ నాయకులు కడారి రాములు తోపాటు పలువురు మద్దతు తెలిపారు సమస్యను పరిష్కరించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

## తెలుగు భాషకు వన్నెతెచ్చిన సినారె

**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) :** డాక్టర్ సినారె తెలుగు భాషకు వన్నెతెచ్చారని రాజన్న సిరిసిల్ల జిల్లా రచయితల సంఘం గౌరవ సలహాదారు జూకంటి జగన్నాథం అన్నారు. సోమవారం గాంధీ చౌరస్తాలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎలగుండ రవి, డాక్టర్ వాసర వేనివేని పరుశరాములు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, డాక్టర్ జనపాల శంకరయ్య, వెంగళ లక్ష్మణ్, బూర దేవానందం, లక్ష్మణ్, అంకారపు రవి, కిరణ్ కుమార్, గుండెల్లి వంశీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





## మాదిగ ఐక్య కార్యచరణ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా లింగంపల్లి మధుకర్

**తెలంగాణ ప్రభ ( సిరిసిల్ల) :** తెలంగాణ మాదిగ ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లింగంపల్లి మధుకర్ ఎన్నికయ్యారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి సోమవారం మధుకర్ నియామకాన్ని ప్రకటించారు. లింగంపల్లి మధుకర్ సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్ద బోనాల గ్రామానికి చెందినవారు. విద్యార్థి నాయకుడిగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమకారుడిగా రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. తన నియామకానికి సహకరించిన పిడమర్తి రవికి తోటి సహచర్లకు మధుకర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధి కోల్పోయిన కార్మికులకు పరిహారం

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** దుండిగల్ మున్సిపల్ పరిధిలోనీ ఇండస్ట్రీ ఏరియా "మాస్క్ ఎంటర్ ప్రైజెస్"కంపెనీలో నవీన్ కుమార్ రెడ్డి, రవి అనే కార్మికులు గత కొన్ని సంవత్సరాలుగా పని చేయడం జరుగుతుంది. కంపెనీ యజమాన్యం కార్మికులకు ఇద్దరికీ చెప్పకుండా డ్యూటీలో నుంచి తీసివేయడం జరిగింది. కార్మికులకు రావలసిన వేతనం ఇవ్వకుండా, ఏదో రకంగా నిర్లక్ష్యం చేస్తూ కార్మికులకు వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ పంపించేవారు. కార్మికులకు ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు



న్యాయం చేస్తారో అని తోటి కార్మికుల ద్వారా తెలుసుకొని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అతని గురించి తెలుసుకొని రవిసింగ్ ఆఫీస్ వద్దకు వెళ్లి కార్మికులకి జరిగిన అన్యాయం చెప్పుకున్నారు, ఆ తర్వాత వెంటనే స్పందించిన రవిసింగ్ హుటాహుటిన మాస్క్ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ దగ్గరికి వెళ్లి యజమాన్యంతో కార్మికులకు రావలసిన వేతనం గురించి పలుమార్లు చర్చించి కార్మికుల ఇద్దరికీ రావాల్సిన వేతనం నవీన్ కుమార్ రెడ్డికి 1,14,000 వేలు, రవికి 48000 వేల రూపాయలు ఇప్పించడం జరిగింది.కార్మికులు నవీన్ కుమార్ రెడ్డి,రవి మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కి మా తరపున, మా కుటుంబ సభ్యుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్..
# సత్యహరిశ్చంద్రుడా?

- ముఖ్యమంత్రి రేవంత్
- విద్యుత్ కొనుగోళ్ల అంశంలో కమిషన్ నిర్ణయం మాది కాదు
- మాజీ సీఎం నిజాయితీని నిరూపించుకోవాలి
- సాయంత్రంలోగా కొత్త ఛైర్మన్ నియమిస్తాం
- జైపాల్ రెడ్డి పుణ్యం వల్లే తెలంగాణకు కరెంట్



తెలంగాణ ప్రభ, హైదరాబాద్ : విద్యుత్ కొనుగోళ్ల విషయంలో తమ నాయకుడు కేసీఆర్ సత్య హరిశ్చంద్రుడు అన్నట్లుగా మాట్లాడిన బీఆర్ఎస్ సభ్యులు కమిషన్ విచారణ రద్దు చేయాలని కోర్టుకు ఎందుకు వెళ్లారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. విద్యుత్ అంశంలో ఎంక్వైరీ వేస్తామని మేము అనలేదన్నారు. అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కోరడంతో ఎంక్వైరీ కమిషన్ నియమించామని స్పష్టం చేశారు. కమిషన్ సమన్లు జారీ చేస్తే బాధ్యత గల పౌరుడిగా విచారణకు హాజరై కేసీఆర్ తన నిజాయితీ నిరూపించుకోవల్సింది పోయి కమిషన్ పై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ అంశంలో జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని కమిషన్ విచారణ వద్దంటూ కోర్టుకు వెళ్లారన్నారు. హైకోర్టులో వీరి వాదనను కొట్టివేస్తే సుప్రీంకోర్టుకు వెళ్లారని అక్కడ అభ్యంతరం ఉంటే కమిషన్ ఛైర్మన్ ను మార్చాలని సూచిస్తూనే విచారణ మాత్రం జరగాల్సిందే అని తేల్చి చెప్పిందన్నారు. సోమవారం సాయంత్రం లోపు విద్యుత్ కమిషన్ కు కొత్త ఛైర్మన్ ను నియమిస్తామని సీఎం వెల్లడించారు. విభజన చట్టంలో వినియోగం ప్రాతిపదికన విద్యుత్ పంపకాలు చేసింది యూపీయే ప్రభుత్వం అన్నారు. విభజన చట్టం ప్రకారం విద్యుత్ పంపకాలలో తెలంగాణకు 36 శాతం, ఏపీకి 64 శాతం వచ్చేలా ఉంటే జైపాల్ రెడ్డి తీవ్రంగా కృషి చేసి మన్మోహన్ సింగ్, సోనియా గాంధీని ఒప్పించి తెలంగాణకు 53.46 శాతం ఇప్పించాడని వెల్లడించారు. కేంద్రం నుంచి ఆదేశాలు ఇప్పించి ఆనాడు తెలంగాణను చీకట్ల నుంచి కాపాడారన్నారు. తెలంగాణకు అదనంగా ఇచ్చిన విద్యుత్ మీద కేసు వేస్తామని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం భావిస్తే నేను ఎర్రబెల్లి దయాకర్ రావు కలిసి చంద్రబాబును ఆపామన్నారు.



## ఎందుకీ డిజిటల్ విధ్వంసం?

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
### ప్రభుత్వ సమాచారం ప్రజల ఆస్తి

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** ప్రభుత్వ వెబ్‌సైట్లు, డిజిటల్ విభాగంపై జరుగుతున్న విధ్వంసంపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. ఈ విషయంలో సీఎస్ జోక్యం చేసుకోవాలని కోరారు. కేసీఆర్ హయాంలోని సమాచారం, వివరాలు తొలగించారన్నారు. గత ప్రభుత్వ సమాచారం, వివరాలు రాష్ట్ర ప్రజల ఆస్తి అని చెప్పారు. భావి తరాల కోసం ఈ డిజిటల్ సంపదను రక్షించాలని కోరారు. వెంటనే సీఎస్ తగిన చర్యలు తీసుకోకపోతే న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. గతంలోనూ అధికారిక వెబ్‌సైట్ల నుంచి ముఖ్యమైన సమాచారం మాయమైందని ఆరోపించారు. దీని వెనుక పాలకుల హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్ వరకు కేసీఆర్ పరిపాలనకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించారని కేటీఆర్ ఆరోపించారు.

## రాత్రి 1.30 తర్వాత కూడా కొనసాగిన అసెంబ్లీ

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్** : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం హోరాహోరీగా జరిగాయి. బడ్జెట్‌పై చర్చలో ప్రభుత్వ, విపక్ష సభ్యులు మాట్లాడారు. అర్ధరాత్రి దాటాక కూడా చర్చ కొనసాగింది. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన శాసనసభ సమావేశాలు రాత్రి 1.30 గంటల తర్వాత కూడా కొనసాగాయి. విద్యుత్ అంశంపై సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఉత్పత్తినే బీఆర్ఎస్ తమ ఘనతగా చెప్పుకుందని, రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించిందని చర్చలో పాల్గొన్న భట్టి విక్రమార్క అన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో అదనపు విద్యుదుత్పత్తిని చేపట్టలేదని ధ్వజమెత్తారు. యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టు పేరిట ఏటా రూ.30,000 కోట్ల భారాన్ని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మోపిందని విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో విద్యుదుత్పత్తి, సరఫరా మెరుగయ్యాయని పేర్కొన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. విద్యుత్ రంగం మెరుగుదలకు తమ ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని చెప్పారు.

## కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు?

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- అసెంబ్లీకి రాని నేతలకు హోదా అవసరమా?
- విద్యుత్ నష్టాలకు కారణం కేసీఆర్

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రజల బాగుకోసం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాని కేసీఆర్ కు ప్రతిపక్ష హోదా ఎందుకని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీలో వివిధ శాఖల పద్దులపై చేపట్టిన చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అరకొర ఉచిత కరెంట్ ఇచ్చి బీఆర్ఎస్ గతంలో గొప్పలు చెప్పిందని ఆరోపించారు. విద్యుత్ శాఖపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందన్నారు. ఒకవేళ అన్ని సక్రమంగా చేస్తే విద్యుత్ సంస్థలు నష్టాల్లోకి ఎందుకు వెళ్లాయని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు ఎందుకు హాజరుకావడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఒకవేళ ఆయన సభకు రాకపోతే బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వాలని మండి పడ్డారు. నష్టాల్లో కూరుకుపోయిన డిస్కంలను లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ చేసిన తప్పులు ఒప్పుకోవాలని ఒకవేళ ప్రభుత్వానికి కరెంట్ కొనుగోళ్ల విషయంలో సలహాలు సూచనలు ఇస్తే తీసుకుంటామని చెప్పారు.





## కేజ్రీవాల్‌పై సీబీఐ ఛార్జిషీట్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో మరో కీలక పరిణామం జరిగింది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పై సీబీఐ కూడా ఛార్జిషీటు దాఖలు చేసింది. లిక్కర్ స్కాంలో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్‌పై సీబీఐ సోమవారం రోస్ అవెన్యూ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. నేరపూరిత కుట్రలో ఆయన కూడా ఒకరని సీబీఐ పేర్కొంది. బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరగనున్న తరుణంలో సీబీఐ కేజ్రీవాల్‌పై ఛార్జిషీట్ దాఖలు చేసింది. జూన్ 26న కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది. ఇదే కేసుకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో మార్చి 21న అరెస్టయ్యారు. ప్రస్తుతం ఆయన సీబీఐకి సంబంధించిన కేసులో ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు.



# మొన్న సమంత.. నేడు నయనతార..

సోషల్ మీడియా తరచుగా సెలబ్రిటీలకు యుద్ధభూమిగా మారుతూ ఉంటుంది. గతంలో సమంత తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్న ఫోటో ఒకటి చర్చనీయాంశమైంది. ఆమె అప్పట్లో హైడ్రోజన్ పెరాక్సైడ్, డిస్టిల్డ్ వాటర్ మిశ్రమంతో ఆవిరి పట్టడం మంచి ఎంపిక... ఇది మ్యాజిక్ లాగా పనిచేస్తుంది.. అవనవసరంగా మాత్రలు మింగడం మానుకోండి.'' అని సమంత స్టోరీలో రాసుకొచ్చింది. అయితే ఈ విధానాన్ని కొంతమంది వైద్యులు సోషల్ మీడియాలో తప్పుపట్టారు. అప్పటికే దెబ్బ తిన్న ఊపిరి తిత్తులలోకి హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్రవేశిస్తే, న్యుమోనియా సహా పలు వ్యాధులను కలగ జేస్తుంది. కొన్నిసార్లు మరణానికి దారి తీస్తుందని హెచ్చరించారు.

అలాగే లేడీ సూపర్ స్టార్ నయనతార పంచుకున్న ఓ పోస్ట్ కూడా చర్చకు దారి తీసింది. ఈ ఏడాదిలోనే ఇన్‌స్టాలోకి అడుగుపెట్టిన నయనతార.. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇన్‌స్టా వేదిక తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మందారపువ్వులతో చేసే టీ గురించి పోస్ట్ పెట్టారు. ఆ టీ తనకెంతో ఇష్టమని పేర్కొన్నారు. దీనివల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలుయన్నాయని వెల్లడించారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుందని.. మధుమేహం, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు. దీనిపై ఓ వైద్యుడు స్పందించాడు. ది లివర్ డాక్టర్ అనే ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టాడు. 8.7 మిలియన్ల మంది ఫాలోవర్స్‌ను ఆమె తప్పుదోవ పట్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆమె మాటల్లో నిజం లేదని పేర్కొన్నాడు. ఆయన ట్వీట్ వైరల్‌గా మారడంతో నయనతార తన పోస్ట్‌ను తొలగించారు.

ఈ పోస్ట్‌పై విమర్శలు రావడంతో తొలగించిన నయనతార.. తాజాగా ఇన్‌స్టాలో ఆసక్తికర సందేశాన్ని పంచుకున్నారు. "తెలివి తక్కువ వారితో వాదించవద్దు. ఆ విధంగా మిమ్మల్ని వారి స్థాయికి తీసుకువెళ్లి, ఓడిస్తారు" అని అమెరికన్ రైటర్ మార్క్ ట్వెన్ సూక్తిని నయన్ షేర్ చేశారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తనని విమర్శించిన వారిని ఉద్దేశించే ఈవిధంగా పెట్టారని పలువురు భావిస్తున్నారు.

సామాన్యుడి ఆయుధం తెలంగాణ ప్రభ